సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం, 7, ఆగస్టు, 2023



ధర్మగుండంలో ప్రత్యేక పూజలు

వేములవాడ: ఇటీవల కురిసిన వర్షాలకు రాజన్న ధర్మగుండంలోకి భారీగా కొత్తనీరు వచ్చి చేరడంతో ఆదివారం పూజలు చేశారు.



రసమయి దిష్టిబొమ్మ దహనం

ఇల్లంతకుంట: సోమారంపేట సర్పంచ్ ఆనందరెడ్డికి రూ.5లక్షల ఎల్ఓసీ ఇచ్చినట్లు అబద్దాలు మాట్లాడరని ఎమ్మెల్యే రసమయి దిష్టిబొమ్మను దహనం చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

నిధులు మంజూరు చేయండి

- టీటీడీ చైర్మన్‌ను కలిసిన జిల్లా నాయకులు



సుబ్బారెడ్డికి విన్నవిస్తున్న జిల్లా నాయకులు

సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ ఆదేశాలతో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు ఆదివారం తిరుపతిలో కలిశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని ఆలయాలకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలను అందజేశారు. నిధులు ఇవ్వడానికి వై.వి.సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పాల్గొన్నారు.

మానేరువాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలి



గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య మానేరువాగుపై హైలెవల్ వంతెన నిర్మిచాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చీటి ఉమేశ్‌రావు నేతృత్వంలో నాయకులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ మానేరు పొంగినప్పుడల్లా లోలెవల్ బ్రిడ్జి మునిగి పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. తాజొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, ఓరుగంటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలు



సిరిసిల్లటౌన్: రాష్ట్రస్థాయి యోగా పోటీలు సిరిసిల్ల వేదికైంది. ఆదివారం స్థానిక సినారె ఆడిటోరియంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14 పిల్లలకు పోటీలు నిర్వహించారు. ఆర్ఎస్‌వైఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పత్తిపాక సురేష్ పర్యవేక్షణలో జరిగాయి. వంద మంది చిన్నారులు పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, ఆర్ఎస్‌వైఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు ఎలిగేటి కృష్ణ, కన్వీనర్ గుడ్ల రవి, కోకన్వీనర్ కరుణాల భద్రాచలం, కౌన్సిలర్ రెడ్యానాయక్ పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి సర్కారు పెద్దపీట



కార్యవర్గంతో బసవరాజు సారయ్య

సిరిసిల్లటౌన్: రజకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ రజక సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రజకులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతిలను రాష్ట్ర సర్కారు అధికారికంగా చేపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలో ఆధునిక దోభీఘాట్లు నిర్మించినట్లు తెలిపారు. ప్రముఖ సినీనటుడు సదానందం కార్యక్రమానికి హాజరయ్యారు.

పట్టణ కార్యవర్గం

రజక సంఘం పట్టణ అధ్యక్షుడిగా దండు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాసర్ల మహేందర్, ఉపాధ్యక్షులు మారుపాక పెద్ద శ్రీనివాస్, కాసర్ల శ్రీనివాస్, కాసర్ల వెంకటేశ్, పోతరాజు గౌరయ్య, కోశాధికారి బండి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి కాసర్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి చెప్యాల మధుసూదన్, కార్యవర్గ సభ్యులుగా కాసర్ల కిషన్, కొయ్యడ శ్రీశైలం, బండి సుమన్, చెప్యాల మహేశ్, బండి శ్రీధర్, మారుపాక అంజయ్యలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజకసంఘం అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రజకసంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిరిగిన వస్త్రం.. చేనేత రంగం

- సర్కారు చేయూత.. కుదుటపడిన చేనేత
- మరనేతతో పోటీతత్వం
- సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు
- ఆర్థికంగా నిలదొక్కుకున్న రంగం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

సిరిసిల్ల: కాలంతోపాటు చేనేతరంగంలోనూ అనేక మార్పులు వచ్చాయి. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో అనేక కులవృత్తులు కాలగర్భంలో కలచిపోతుండగా.. చేనేత మాత్రం ఆధునికతను సంతరించుకుంటూ సగర్వంగా తలెత్తుకొని నిలబడుతోంది. చేనేతరంగం వయోభారంతో ఉండగా.. పవర్‌లూమ్ రంగం ఆత్మగౌరవంతో జీవించేందుకు ఆరాటపడుతోంది. దేశంలో వ్యవసాయరంగం తర్వాత రెండో స్థానాన్ని వస్త్రోత్పత్తి రంగం ఆక్రమించింది. చేనేత మగ్గాలపై అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసి ప్రపంచానికి చేనేత కళావైభవాన్ని చాటిచెప్పిన ఘనత సిరిసిల్ల నేత కార్మికులది. కాలంతో పోటీపడుతూ రేయింబవళ్లు శ్రమించే నేతన్నలపై జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనం..



సిరిసిల్లలో చేనేత మగ్గంపై వృద్ధ కార్మికుడు

ఇదీ చేనేత దినోత్సవ నేపథ్యం

1905లో పశ్చిమబెంగాల్ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ చేనేతరంగంలో ఉద్యమం మొదలైంది. కోల్‌కత టౌన్ హాల్‌లో 1905 ఆగస్టు 7న నిర్వహించిన భారీ సమావేశంలో విదేశీవస్త్రాలను బహిష్కరించి.. స్వదేశీ వస్త్రాలను ధరించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన చేనేతరంగానికి గుర్తింపునిస్తూ 2012 ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ నేత కార్మికులకు అవార్డులు అందిస్తున్నారు. తెలంగాణలో రాష్ట్ర స్థాయిలోనూ అవార్డులు ఇస్తున్నారు.

సిరిసిల్లలోనే తొలి నేతన్న విగ్రహం

దేశంలో ఎక్కడా లేని విధంగా తొలి చేనేత కార్మికుని కాంస్య విగ్రహాన్ని సిరిసిల్లలో నెలకొల్పారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 78 వేల మరమగ్గాలు ఉండగా.. ఒక్క సిరిసిల్లలోనే 34 వేల మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో 27 వేల మరమగ్గాలపై పాలిస్టర్ వస్త్రం, ఏడువేల మగ్గాలపై కాటన్ వస్త్రోత్పత్తి చేస్తున్నారు. సిరిసిల్లలో నిత్యం 25వేల మంది కార్మికులు 34 లక్షల మీ టర్ల వస్త్రాన్ని తయారు చేస్తున్నారు. సిరిసిల్లలో చేనేత మగ్గాలు 175 ఉండగా.. వీటిపై 77 మంది వృద్ధులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలోనే తొలి టెక్స్‌టైల్ పార్క్ ఇక్కడే ఏర్పాటు చేశారు. జాతీయ జెండాలను 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇక్కడే తయారు చేసి దేశవ్యాప్తంగా సరఫరా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి 20 లక్షల బతుకమ్మ చీరల, కేసీఆర్ కిట్లు, సర్వశిక్ష అభియాన్, ఎస్సీ, బీసీ, ఎస్టీ వెల్ఫేర్ శాఖలకు అవసరమైన వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇస్తుండడంతో కార్మికులకు మెరుగైన ఉపాధి లభిస్తుంది. ఈ ఏడాది రూ.350 కోట్ల ఆర్డర్లు సిరిసిల్లకు వచ్చాయి. సిరిసిల్ల శివారులోని అపెరల్‌పార్క్‌లో గోకుల్‌దాస్ గార్మెంట్ యూనిట్ 400 మంది మహిళలకు ఉపాధినిస్తుంది. అమెరికాకు రెడీమేడ్ వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయి. వస్త్రపరిశ్రమ సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు చొరవతో కుదుటపడింది.

నేతన్నలకు బీమా ఓ వరం

వస్త్రోత్పత్తి రంగంలో శ్రమించే నేతన్నలకు రైతుల తరహాలో రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. సీఎం కేసీఆర్ 2021 జూలై 4న సిరిసిల్ల వేదికగా నేతన్నలకు బీమా పథకాన్ని ప్రకటించారు. ఈ పథకాన్ని 18–59 ఏళ్ల మధ్య వయస్సు గల నేతకార్మికులకు గతేడాది చేనేత దినోత్సవం నుంచి అమలు చేస్తున్నారు. నిజంగానే నేతన్నలకు బీమా పథకం వారి కుటుంబాలకు ఓ భరోసా లభిస్తుంది. బీమాలో చేరిన నేతన్నలు ఏ కారణంగానైన మరణిస్తే ఆ కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ఎల్ఐసీ ద్వారా అందుతుంది. నేతకార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ పొదుపు పథకాలు ఉపయోగకరంగా ఉన్నాయి. సిరిసిల్లలో ఆధునిక మగ్గాలపై వస్త్రోత్పత్తి శిక్షణను నేటి తరం యువతకు అందించాలి. నేటితరం యువకులు ప్రపంచంతో పోటీ పడేలా నాణ్యమైన వస్త్రాల ఉత్పత్తికి అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.



మరమగ్గాలు



అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల తయారీ

మార్కెట్‌లో సవాళ్లు

కరోనా లాక్‌డౌన్ ప్రభావంతో వస్త్రోత్పత్తి రంగం సైతం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఉత్పత్తి అయిన వస్త్రానికి మార్కెట్ వసతి లేక.. బట్టకు డిమాండ్ లేక వస్త్రోత్పత్తి రంగం కష్టాల్లో ఉంది. మొత్తం వ్యవస్థ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంది. దీంతో ఈ రంగంపై ఆధారపడిన కార్మికులు ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పరంగా ఆజమాయిషి ఉండేలా వస్త్రోత్పత్తి రంగాన్ని తీర్చిదిద్దాలి. నేతకార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఆధునిక మగ్గాలపై శిక్షణ ఇవ్వాలి. పేదరికమే అర్హతగా అంత్యోదయ కార్డులు, ఆర్థిక చేకూర్పు, మహిళా సంక్షేమ పథకాల అమలు చేయాలి. సిరిసిల్లలో నూలుడిపోను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కార్మికులకు పీఎఫ్ సౌకర్యం, త్రిఫ్ట్ పథకంలో అందరినీ చేర్పించడం, గుర్తింపుకార్డులు ఇచ్చి ఆరోగ్య సంరక్షణ పథకాలు అందించాలి. ప్రభుత్వపరంగా స్పష్టమైన విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. సిరిసిల్లలో నూలు డిపోలు ఏర్పాటు చేయిస్తే.. పరిశ్రమలోని చిన్న ఆసాములకు ఎంతో మేలు జరుగుతుంది.

ఆచార్య జయశంకర్ స్ఫూర్తి ప్రదాత

- అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: ఆచార్య జయశంకర్ తెలంగాణ స్ఫూర్తి ప్రదాతగా చరిత్రలో నిలిచిపోతారని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం జయశంకర్ 89వ జయంతి వేడుకలను నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సత్యప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమస్ఫూర్తి ప్రదాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. భవిష్యత్ తరాలకు గుర్తుండి పోయేలా తెలంగాణ ఉద్యమాన్ని నడిపారన్నారు. సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్, డీపీఆర్‌వో దశరథం పాల్గొన్నారు. జెడ్పీ ఆఫీస్‌లో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, మున్సిపల్ ఆఫీస్‌లో చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ ఆయాజ్ నివాళి అర్పించారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయశంకర్ జయంతి వేడుకల్లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, నాయకులు కంచర్ల రవిగౌడ్, రుద్రవీణ, అజిత్, నవీన్, అఖిల్, పోచమ్మ ఆలయం తెలంగాణ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్, కూర శ్రీధర్ పాల్గొన్నారు.

చేనేత ఉత్సవాలకు ఇరవై బస్సులు

- చేనేత, జౌళిశాఖ ఏడీ సాగర్

సిరిసిల్లటౌన్: రంగారెడ్డిలో సోమవారం నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవానికి పెద్ద ఎత్తున కార్మికులు, ఆసాములు హాజరుకావాలని చేనేత, జౌళిశాఖ ఏడీ సాగర్ కోరారు. సిరిసిల్ల వస్త్రోత్పత్తి కార్మికులు, ఆసాములు పాల్గొనేందుకు 20 బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలోని కార్మికులు, ఆసాములు, వస్త్రోత్పత్తిదారులు పాల్గొనాలని కోరారు.

కష్టపడి కొలువు కొట్టారు

- ఎస్సైలుగా ఎంపికైన జిల్లా యువకులు
- అధికారులుగా సామాన్యులు

సిరిసిల్లక్రైం: కష్టపడ్డారు.. ఎస్సై కొలువులు కొట్టారు. జిల్లాలోని సామాన్య కుటుంబాలకు చెందిన యువకులు ఆదివారం వెలువడ్డ ఫలితాలలో ఎస్సైలుగా ఎంపికయ్యారు. వ్యవసాయ కూలీ, సోడాబండి నిర్వాహకుడు, కూరగాయల వ్యాపారులు, హమాలీల పిల్లలు ఎస్సైలుగా ఉద్యోగాలు సాధించారు.

తండ్రి ఆశయ సాధనకు..



హుజూరాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన వి.లక్ష్మణ్ ప్రస్తుతం సిరిసిల్ల ఏఆర్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రి రాజేశం సోడాబండి నిర్వహించగా ఏడాదిన్నర క్రితం చనిపోయాడు. అమ్మ అరుణ వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటుంది. పేద కుటుంబమైనప్పటికీ తల్లిదండ్రుల ఆశయ సాధనే లక్ష్యంగా చదివి ఎస్సైగా ఎంపికయ్యాడు. లక్ష్మణ్ సోదరులు ఇద్దరిలో ఒకరు పాథలాజికల్ ల్యాబ్, ఇంకొకరు మిషన్ భగీరథ ఏఈఈగా పని చేస్తున్నారు. తండ్రి ఆశయాన్ని నెరవేర్చాడు. ఆర్ఐ కుమారస్వామి సలహాలు ఉపయోగపడ్డాయన్నారు.

తల్లిదండ్రుల కోరిక మేరకు..



చందుర్తి మండలానికి చెందిన సీహెచ్ మహేశ్ సిరిసిల్లలోని సర్దాపూర్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అమ్మానాన్న వ్యవసాయం చేస్తుంటారు. తల్లిదండ్రుల కోరిక మేరకు చదివి ఫింగర్‌ప్రింట్స్‌లో ఏఎస్సైగా ఎంపికయ్యాడు. మహేశ్ తమ్ముడు తిరుపతి 2020లో ఎస్సైగా ఎంపికయ్యాడు.

రెండోసారి ఎస్సైగా..



సిరిసిల్ల ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పిట్ల దీపక్ రెండో ప్రయత్నంలో సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. పాఠశాలలో చదివే వయసు నుంచి అన్నింట్లో ముందుండేవాడు. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన దీపక్ గతంలో ఎస్సై ఉద్యోగానికి ప్రయత్నించగా ఒక్క మార్కుతో జాబ్ రాలేకపోయింది. రెండోసారి శ్రద్ధగా చదివి సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. తల్లి గృహిణి కాగా తండ్రి శ్రీశైలం టీవీ మెకానిక్. సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చిన్నబాబాయి శంకర్ ప్రోత్సాహంతోనే పోలీస్ డిపార్ట్‌మెంట్ వైపు అడుగులు వేసినట్లు దీపక్ తెలిపారు.

పట్టుదలతో సాధించాడు



ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి చెందిన అందె సతీశ్ మొదటి ప్రయత్నంలో ఎస్సైగా ఎంపికవలేదు. అయినా నిరాశ చెందకుండా పట్టు వదలకుండా రెండోసారి ప్రయత్నించాడు. ఆదివారం వెలువడ్డ ఫలితాలలో సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. తల్లి నర్సవ్వ కూరగాయల విక్రయిస్తూ కుటుంబాన్ని వెల్లదీస్తుండగా, తండ్రి సత్తయ్య వ్యవసాయ పనులు చేస్తుంటాడు.

హమాలీ కొడుకు ఎస్సైగా..



వేములవాడరూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన మొగిలి కార్తీక్ సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. తండ్రి దేవయ్య హమాలీగా పనిచేస్తుండగా తల్లి లక్ష్మి వ్యవసాయ కూలీ. అన్న రమేశ్ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. నాన్న కోరికను తీర్చేందుకు రాత్రి, పగలు తేడా లేకుండా చదివి ఎస్సైగా ఎంపికయ్యాడు.

పేదింటి కల నెరవేరింది



చందుర్తి(వేములవాడ): మండలంలోని ఎన్గల్‌కు చెందిన జవ్వాజి వినోద–రామస్వామిలకు ముగ్గురు సంతానం. మూడో కొడుకు జవ్వాజి అరుణ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. తండ్రి రామస్వామి కల్లుగీత కార్మికుడిగా, తల్లి వినోద కూలీ పని చేస్తుంటారు. పోలీస్ కావాలనేది చిన్ననాటి ఆశయమని తెలిపారు. తొలి ప్రయత్నంలోనే ఎస్సైగా ఎంపికవడంతో తన ఆనందానికి అవధులు లేవు.

ఎస్సైగా కొప్పుల స్వాతి



వేములవాడ: వేములవాడకు చెందిన కొప్పుల లింగమూర్తి –పావని దంపతుల కూతురు కొప్పుల స్వాతి నాలుగో ర్యాంక్‌తో ఎస్సైగా ఎంపికైంది. తండ్రి లింగమూర్తి చిరువ్యాపారి, తల్లి పావని బీడీ కార్మికురాలు. బీటెక్ చదివిన స్వాతి ఎస్సైగా ఎంపికైంది.

మానేరుతీరం.. గద్దర్ పాట ప్రవాహం

ఉద్యమాల పాటలకు ఊపిరి గద్దర్

- సిరిసిల్ల ప్రాంతంలో మారుమోగిన గద్దర్ పాటలు
- యుద్ధనౌక గొంతు వింటూనే మేల్కొన్న పల్లెలు
- 2011 మార్చి 6న సిరిసిల్లలో పాటల తూటాలు
- గద్దర్ మృతిపై నివాళి



2011 మార్చి 6న సిరిసిల్లలో కళాకారులతో..



వేములవాడలో గద్దర్ ఆటపాటలు (ఫైల్)

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): 'ఊరు మనదిరా.. ఈ వాడ మనదిరా.., బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి.., నన్ను గన్న తల్లులారా తెలంగాణ పల్లెలారా.., నీ పాదంమీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా.., అమ్మా తెలంగాణమా.. ఆకలి కేకల గానమా.. పొడుస్తున్న పొద్దు మీద.. నడుస్తున్న గానమా..' ఈ పాటలతోనే సిరిసిల్ల ప్రాంతంలోని పల్లెలు ఒకప్పుడు మేల్కొనేటివి. నక్సలైట్ల ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న 1990వ దశకంలో సిరిసిల్ల ప్రాంతంలోని ప్రతీ గడప నుంచి గద్దర్ గొంతు వినిపించేది. అయితే గద్దర్ మరణంతో జిల్లాలోని పల్లెల్లో ఆనాటి జ్ఞాపకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ఆనాటి నక్సల్బరీ ఉద్యమం నుంచి ఈనాటి మలి దశ తెలంగాణ ఉద్యమం వరకు యుద్ధనౌక గద్దర్ పాత్ర అనిర్వచనీయం. ప్రతీ సందర్భంలో తన గొంతుతో ప్రజలను పోరాటాలకు సిద్ధం చేసిన వ్యక్తి. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పలు పల్లెలతో గద్దర్‌కు విడదీయరాని అనుబంధం ఉంది.

గానంతో ఉద్రుతలూగించిన గద్దర్

ప్రజాయుద్ధ నౌక.. ప్రజాగాయకుడు.. గద్దర్‌గా ప్రసిద్ధి చెందిన 77 ఏళ్ల విఠల్‌రావుకు జిల్లాతో విడదీయరాని బంధం ఉంది. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతంలో సాగిన సాయుధ పోరాటంలో ఆయన పాట ప్రవాహమై కొనసాగింది. 1990 దశకంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన అప్పటి పీపుల్స్‌వార్ (మావోయిస్టు) పార్టీ బహిరంగ సభకు జిల్లా నుంచి వేలాది మంది యువకులు తరలివెళ్లారు. లారీలు, బస్సుల్లో తరలివెళ్లి గద్దర్ సభలో పాల్గొన్నారు. ఆ స్ఫూర్తితో వందలాది మంది యువకులు పీపుల్స్‌వార్ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. 1996లో వరంగల్‌లో జరిగిన తెలంగాణ సాధన ఉద్యమంలోనూ జిల్లాకు చెందిన వందలాది మంది యువకులు భాగస్వాములై రాష్ట్ర సాధన ఆవశ్యకతను చాటిచెప్పారు. అప్పటి వరంగల్ సభలో గద్దర్‌తోపాటు ప్రజాకవి కాళోజీ, వంగపండు పాల్గొన్నారు.

- **ప్లీనరీలలో ఆటపాట**

మద్దిమల్లలో రెండుసార్లు జరిగిన ప్లీనరీ సమావేశాలకు గద్దర్ హాజరయ్యారు. అప్పటి పీపుల్స్‌వార్ ఉత్తర తెలంగాణ కార్యదర్శి దొంత మార్కండేయ ఉరఫ్ శంకర్, మల్లోజుల కోటేశ్వర్‌రావు, శీలం నరేశ్, దగ్గు రాజలింగు, ఐలన్న, నర్సింహారెడ్డిలతో కలిసి ఈ ప్రాంతంలో సంచరించారు.

- **మలి దశ ఉద్యమంలో..**

మలి దశ తెలంగాణ ఉద్యమంలో గద్దర్ సిరిసిల్లకు వచ్చారు. 2011 మార్చి 6న మున్సిపల్ ఉద్యోగుల ఫోరమ్, పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో అప్పటి మున్సిపల్ డీఈఈ శీలం శంకర్ భారీ ఎత్తున సభ నిర్వహించారు. ఈ సభకు గద్దర్, అరుణోదయ గాయని విమలక్క, అప్పటి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ కేంద్ర మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు హాజరయ్యారు. గద్దర్ సభలో ప్రసంగిస్తుండగా.. ఎమ్మెల్యేగా కేటీఆర్, అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ గుడ్ల మంజుల సభ ముందు నేలపై కూర్చోవడం విశేషం.

- **దళిత సంఘాల నేతల నివాళి**

గద్దర్ మృతిపై దళిత సంఘాల నేతలు ఆదివారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నివాళి అర్పించారు. దళిత నాయకులు కత్తెర దేవదాస్, రాగుల రాములు, ఆకునూరి బాలరాజు, నాలుక సత్యం, జక్కుల యాదగిరి, కంసాల మల్లేశం, రొడ్డ రామచంద్రం, బీసీ నాయకులు బొల్లి రామ్మోహన్ నివాళి అర్పించారు.

సినారె స్వగ్రామంలో..

వేములవాడ/వేములవాడరూరల్: జన నాట్యమండలి వ్యవస్థాపక సభ్యుడు గద్దర్ మృతిచెందడంతో వేములవాడ మండలంలో కళాకారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వేములవాడ ప్రాంత కళాకారులతో ఆయనకు విడదీయలేని అనుబంధం ఉంది. తెలంగాణ ఉద్యమంతో పాటు పలు సందర్భాల్లో ఈ ప్రాంతంలో పర్యటించారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి స్వగ్రామం హన్మాజిపేటలో 2010లో జరిగిన ఓ కార్యక్రమానికి గద్దర్ హాజరయ్యారు. ఆయనతోపాటు అప్పటి ఓయూ ఆర్ట్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ సంకసాల మల్లేశం, టీఆర్ఎస్ నాయకులు నారదాసు లక్ష్మణ్, తీగల రవీందర్ గౌడ్, జేఏసీ కన్వీనర్ నేరెళ్ల తిరుమల్‌గౌడ్‌లతో కలసి హాజరయ్యారు. రాజన్న ఆలయంలో కోడెమొక్కు చెల్లించుకున్నారు.


తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర



గద్దరు మృతి తెలంగాణ ప్రజలకు తీరని లోటు, తెలంగాణ ఉద్యమంలో ముఖ్యభూమిక పోషించారు. రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన గద్దర్ మరణం జీర్ణించుకోలేనిది. వరుసగా కళాకారులు మరణించడం తీరని నష్టం.

–తోట ఆగయ్య, బీఆర్ఎల్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యమ గొంతు మూగబోయింది




నాలుగు దశాబ్దాలపాటు ప్రజల పాటలను పాడుతూ ప్రజా ఉద్యమాలను నడిపించిన ఉద్యమ గొంతుక మూగబోయింది. గాయకుడిగా, రచయితగా తెలంగాణ ఉద్యమంలో ముందున్నారు. గుండెల్లో తూటాలున్నా.. ప్రజాసమస్యలపై గొంతు వినిపించారు. గద్దర్ మరణం తీరని లోటు. – జూకంటి జగన్నాథం, కవి, రచయిత

ప్రజాపోరాటాలకు ఊపిరి ఊదారు



ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రజాపోరాటాలకు గద్దర్ ఊపిరి ఊదారు. ప్రజల గొంతుక శాశ్వతంగా మూగబోయింది. అణగారిన ప్రజా బాహుళ్యానికి ఆయన మరణం తీరని లోటు. గద్దర్ అన్నకు జోహార్లు. ఆయన పాటను, రచనలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరిచిపోదు. – మద్దికుంట లక్ష్మణ్, కవి

పాట బలం చూపించిన గద్దర్



నిబద్ధతతో పనిచేసి వేలాది మందిని ప్రభావితం చేసిన వ్యక్తి గద్దర్. ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చారు. ప్రజా ఉద్యమాన్ని గుండెల మీద మోసిండు. గుండెల్లో తూటాలున్నా.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. పాటకు చిరునామాగా నిలిచారు.

– పెద్దింటి అశోక్‌కుమార్, కథకుడు

క్లుప్తంగా

కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు



కిషన్‌రెడ్డికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న బీజేపీ నేతలు

సిరిసిల్ల టౌన్‌: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని జిల్లా బీజేపీ నేతలు కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అన్నల్‌దాస్‌ వేణు, చందుర్తి సర్పంచ్‌ సిరికొండ శ్రీనివాస్‌, అన్నాడి జలపతిరెడ్డి, తదితరులున్నారు.

కుట్టుమెషిన్లు పంపిణీ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దోర్కా కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసిన ఔత్సాహికులకు ఆదివారం కుట్టుమెషిన్లు పంపిణీ చేశారు. రియల్‌ ఇండియా మినిస్ట్రీస్‌ అధ్యక్షుడు జయకుమార్‌, సుజాతరాణి ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ రెండేళ్లుగా చాలా మంది మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గద్దెగారి మధు, శివరాత్రి లక్ష్మణ్‌, రామిండ్ల సంపూర్ణ, మధు తలారి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న మారసం ప్రతినిధులు టీవీ నారాయణ, లక్ష్మణ్‌, మహిళా కార్మికులు

సిరిసిల్ల కల్చరల్‌: సంఘ సంస్కర్తలైన ఇద్దరు మహనీయుల జీవితాంశాల్లోని ఇతి వృత్తాలతో వెలువడిన రెండు పుస్తకాలను మానేరు రచయితల సంఘం ఆదివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించింది. మహాత్మా జ్యోతి బాపూలే గురించి వనపట్ల సుబ్బయ్య రాసిన ‘బహుజన బావుటా’, డాక్టర్‌ రాములు రచించిన ‘నేను సావిత్రి బాయి పులేని మాట్లాడుతున్నాను’ అనే రెండు దీర్ఘ కావ్యాలను పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని ప్రైవేట్‌ గార్మెంట్స్‌లోని కార్మికుల చేత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారసం ప్రతినిధులు టీవీనారాయణ, ఆడెపు లక్ష్మణ్‌ మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్‌ సూచన మేరకు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కవయిత్రి మడూరి అనిత చరణ్‌, మహిళా కార్మికులు నల్ల మంజుల, కవిత, లలిత, ఉమా తదితరులున్నారు.

ఉద్యోగం ఇవ్వలే.. షట్టర్‌ రాలే

- బద్దిపోచమ్మ నిర్వాసితుల గోడు
- ఉపాధి కోల్పోయామంటూ ఆందోళన
- ఆలయ విస్తరణకు 38 ఇళ్లు సేకరణ
- ఇంటికో ఉద్యోగం, షట్టర్‌ ఇస్తామని హామీ
- ఉద్యోగాలకు 34 మంది అర్హులుగా గుర్తింపు
- ఏడాది గడుస్తున్నా నెరవేరని హామీ



మంత్రి కేటీఆర్‌ చేతులమీదుగా చెక్కు తీసుకుంటున్న ఈమె వేములవాడకు చెందిన కైరి మమత. ఏడాది క్రితం చెక్కులు పంపిణీ చేశారు. బద్దిపోచమ్మ ఆలయం వద్ద ఇల్లు ఉండడంతో రెండు దుకాణాలు నిర్వహిస్తూ ఉపాధి పొందేవారు. ఇంటిని ఆలయ విస్తరణకు అప్పగించడంతో ఉపాధి కోల్పోయారు. ఉద్యోగం ఇస్తామని చెప్పి ఏడాదిగా పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న పంతంగి శ్రీనివాస్‌ తనకు ఉపాధి, ఉద్యోగం ఇవ్వడం లేదంటూ ఓసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణకు తన ఇంటిని అప్పగించాడు. ఇప్పటి వరకు ఉద్యోగం కానీ వ్యాపారం చేసుకునేందకు షట్టర్‌ కానీ ఇవ్వలేదు. తన చిన్నతనంలో పచ్చునూరు డ్యామ్‌లో ఇల్లు పోతే వేములవాడకు వచ్చారు. ఇప్పుడు ఇక్కడి నుంచి బోయినపల్లికి వెళ్లారు. తనకున్న షట్టర్‌ పోయి ఏడాది గడవడంతో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాడు.

వివరాలు ఇలా..

సేకరించిన ఇళ్లు	38
లభించిన స్థలం	39 గుంటలు
ఇచ్చిన పరిహారం	రూ.20కోట్లు
ఉద్యోగాలకు అర్హులు	34 మంది



వేములవాడ: ఆధ్యాత్మిక కేంద్రం వేములవాడలోని బద్దిపోచమ్మ ఆలయం చిన్నదిగా ఉండడం.. ఇరుకైన ప్రాంతం కావడంతో భక్తులు ఇబ్బంది పడేవారు. బోనం మొక్కులు చెల్లించుకునే భక్తుల కష్టాలను దూరం చేసేందుకు ప్రభుత్వం గుడి విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గుడి సమీపంలోని 38 ఇళ్లను అధికారులు సేకరించగా.. 39 గుంటలు చేకూరింది. ఇళ్ల సేకరణ సమయంలో ఇంటికో ఉద్యోగం, వ్యాపారం చేసుకునేందుకు షట్టర్‌ ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఏడాది గడుస్తున్నా హామీ అమలుకావడం లేదు. గతంలో వ్యాపారాలు చేసుకుని బతికేవాళ్లమని.. ఇప్పుడు ఇళ్లు కోల్పోయి.. ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నామని బద్దిపోచమ్మ ఆలయ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

39 గుంటలతో ఆలయ విస్తరణ

బద్దిపోచమ్మ ఆలయాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించగా.. స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, అధికారులు సమీపంలోని నివసించే వారితో పలుమార్లు సమావేశమయ్యారు. గుడి విస్తరణకు కావాల్సిన భూమికోసం ఇళ్లుఇస్తే పరిహారంతోపాటు ఉద్యోగం, వ్యాపారం చేసుకునేందుకు షట్టర్‌ ఇస్తామని హామీఇచ్చారు. ఇందుకు బద్దిపోచమ్మ గుడి చుట్టుపక్కల నివసించే వారు అంగీకరించడంతో ఇళ్లను సేకరించి రూ.20కోట్ల పరిహారం అందజేశారు. 34 మందిని ఉద్యోగాలకు అర్హులుగా గుర్తించారు. "పరిహారం ఏడాది గడుస్తున్నా నిర్వాసితులకు మాత్రం ఉద్యోగం, నామమాత్రపు అద్దెకింద ఇవ్వాల్సిన షట్టర్‌ గురించి పట్టించుకోవడం లేదు. బద్దిపోచమ్మ ఆలయం వద్ద ఉన్నప్పుడు తమ షట్టర్లలో వ్యాపారాలు చేసుకుని బతికేవారమని.. వ్యాపారాలు లేక ఇతర పనులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలకు రూ.25వేల అద్దె వచ్చేది



మాకు ఒక షట్టర్‌, వెనుక మూడు రూములు, పై అంతస్తులో మరో నాలుగు గదులు ఉండేవి. నెలకు రూ.25 వేల వరకు అద్దె వచ్చేది. స్థలం తీసుకుని ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ఉపాధి చూపించలేదు, ఉద్యోగం ఇవ్వలేదు. – పారుపెల్లి లచ్చయ్య

ఉన్న ఆస్తి పోయింది



బద్దిపోచమ్మ గుడి కోసం నాకున్న రెండు దుకాణాల గదులు, వెనుక పోర్షన్‌ మొత్తం పోయింది. ప్రభుత్వం ఇచ్చిన పరిహారంతో భూమి కూడా రాలేదు. ఉన్న ఆస్తి మొత్తం పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇస్తానన్న ఉద్యోగం, షట్టర్‌ ఇవ్వాలే. – జనగామ లక్ష్మి

అద్దె ఇంట్లో ఉంటున్నాం



మాకు ఐదు గుంటల్లో ఇల్లు ఉండేది. బద్దిపోచమ్మ గుడి కోసం ఆ ఇల్లు ను తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పరి హారం పైసలను ఇద్దరు కొడుకులు, ఒక కూతురికి ఇచ్చేసిన. ఇప్పుడు కిరా యికి ఉంటున్నాం. దుకాణం ఇవ్వలేదు. ఏడాదిగా ఎదురుచూస్తున్నాం. – కూర చంద్రకళ

34 మందిని అర్హులుగా గుర్తించాం

బద్దిపోచమ్మ ఆలయ విస్తరణకు 38 ఇళ్లు తీసుకున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వివరాలు సేకరించి ఉద్యోగాలకు 34 మందిని అర్హులుగా గుర్తించాం. ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. – సత్యనారాయణ, వీటీడీఏ ఎస్టేట్‌ అధికారి

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్‌ మహాజన్‌



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌ మహాజన్‌

సిరిసిల్లక్రైం: సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్‌మహాజన్‌ సూచించారు. సైబర్‌ నేరాలను నిరోధించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మీడియాకు వివరించారు. నకిలీ లాటరీలు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, నకిలీ బ్యాంకు అకౌంట్‌ సమాచారం, నకిలీ గిఫ్ట్‌ బాక్సులు, లోన్‌ యాప్‌లను నమ్మవద్దని కోరారు. వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాలలో పంచుకోవద్దని సూచించారు. సైబర్‌క్రైం జరిగిన వెంటనే 1930 కాల్‌చేస్తే సైబర్‌ నేరగాళ్లు కొట్టేసి డబ్బును తిరిగి పొందేలా చేయవచ్చని తెలిపారు. ఇటీవల ఇలాగే సిరిసిల్ల టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో రెండు సంఘటనలు జరిగాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని వివేకానంద హైస్కూల్‌లో 2007–08 విద్యా సంవత్సరంలో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం దత్తసాయి ఫంక్షన్‌ హాల్‌లో జరిగింది. 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సన్మానించారు. ఆనందోత్సాహాలతో ఆడిపాడారు. ఫ్రెండ్‌షిప్‌ డే సందర్భంగా కేక్‌ కట్‌ చేశారు.

చందాలతో వలస కూలీ అంత్యక్రియలు

- నాడు అమ్మ.. నేడు నాన్న మృతి
- అనాథలుగా ముగ్గురు కూతుళ్లు
- కొదురుపాకలో ఘటన



శేఖర్‌ మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి): పదేళ్ల క్రితం తల్లి స్వప్న, ఇప్పుడు తండ్రి చనిపోవడంతో ముగ్గురు కూతుళ్లు అనాథలుగా మారారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా లంబాడిపల్లికి చెందిన గంధం శేఖర్‌–స్వప్న దంపతులు పాతికేళ్ల క్రితం మండలంలోని కొదురుపాక గ్రామానికి వలస వచ్చారు. ఇక్కడే పాతముంపు గ్రామం పరిసరాల్లో గుడిసెలో నివాసముంటూ ఉంటూ, మేకల కాపర్లుగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరికి శ్యామల, స్రవంతి, శైలజ, రాజేశ్వరి, పంచముఖి ఐదుగురు కూతుళ్లు కాగా శేఖర్‌ భార్య స్వప్న పదేళ్ల కింద అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి కూతుళ్ల బాగోగులు శేఖర్‌ చూసేవాడు. ఇందులో శ్యామల, స్రవంతి, వివాహాలు జరిగాయి. ముగ్గురు చిన్నారుల్లో శైలజ స్థానిక కేజీబీవీలో ఇంటర్‌, రాజేశ్వరి, పంముఖి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకరు ఏడు, మరొకరు ఐదో తరతగతి చదువున్నారని గ్రామస్తులు తెలిపారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శేఖర్‌ ఆదివారం మృతిచెందాడు. అంత్యక్రియలకు వారివద్ద చిల్లిగవ్వ లేకపోవడంతో గ్రామ మత్స్యకార్మికల సంఘం ఆధ్వర్యంలో రూ.12వేల చందాలు వసూలు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. శేఖర్‌ కూతుళ్లను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం నాయకులు రాగుల మల్లేశం, ర్యాకం అనీల్‌, కల్లెం శ్రీనివాస్‌, పందుల దేవయ్య విజ్ఞప్తి చేశారు.

పోస్టు డబ్బా ఇలా..ఉత్తరాలెలా



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల) : మండలకేంద్రంలోని హెడ్‌ పోస్టాఫీస్‌ ఎదుట గోడకు పోస్టల్‌ శాఖ ఏర్పాటు చేసిన పోస్ట్‌బాక్స్‌ కింది భాగం ఊడిపోయింది. ఊడిపోయి ఉన్న బాక్స్‌ ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు ఎలా జరిపేదని ప్రజలు వాపోతున్నారు. హెడ్‌ పోస్టాఫీస్‌ పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో ఉండే పోస్టుబాక్సుల పరిస్థితి ఎలా ఉందో తెలియడం లేదు. ఊడిపోయిన ఉన్న బాక్స్‌లను నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారుపై తగు చర్యలు తీసుకొని బాక్స్‌లను మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సెకండ్‌ ఏఎన్‌ఎంల పోరుబాట



ఆందోళన చేస్తున్న సెకండ్‌ ఏఎన్‌ఎంలు

- రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌
- మొదటి ఏఎన్‌ఎంలకు దీటుగా విధులు
- జిల్లాలో 122 మంది రెండో ఏఎన్‌ఎంలు

ముస్తాబాద్‌(సిరిసిల్ల): సమానపనికి సమాన వేతనాల కోసం రెండో ఏఎన్‌ఎంలు పోరుబాట పట్టారు. తమను రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు. పదహారేళ్లుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు ఇప్పుడు ప్రభుత్వం తీపికబురు అందిస్తోందని ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఏఎన్‌ఎంల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్‌ను విడుదల చేసిన నేపథ్యంలో రెండో ఏఎన్‌ఎంలు ఆందోళన బాటపట్టారు.

2007లో విధుల్లోకి..

నేషనల్‌ హెల్త్‌ మిషన్‌ ద్వారా 2007లో రూ.4200 వేతనాలతో రెండో ఏఎన్‌ఎంలు విధుల్లో చేరారు. 2017లో ప్రభుత్వం వీరి వేతనాలను రూ.25వేలకు పెంచింది. జిల్లాలో 122 మంది రెండో ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో మొదటి ఏఎన్‌ఎంలకు దీటుగా రెండో ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు. ఆయా ఉపకేంద్రాల్లో మొదటి ఏఎన్‌ఎం తర్వాత పనిచేసే వీరిని రెండో ఏఎన్‌ఎంగా పిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను రెండో ఏఎన్‌ఎంలంటూ వివక్షకు గురిచేస్తున్నారన్నారు. కొవిడ్‌ సమయంలో, హెల్త్‌ సర్వేలో మారుమూల పల్లెలకు, ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించారు.

రెండో ఏఎన్‌ఎంల విధులు..

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఒకే పని, ఒకే విద్యార్హతతో మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా పనిచేస్తున్నారు. కేంద్రాల్లో రోజుకూ 16 గంటలు పనిచేస్తున్నారు. ఇమ్యూనైజేషన్‌, 36 రికార్డులతోపాటు, ఆన్‌లైన్‌లో 18 మొబైల్‌ యాప్‌లను నిర్వహిస్తున్నారు. గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లడం, డెలివరీలకు రిఫర్‌ చేయడం, టీకాలు ఇప్పించడం వంటి పనులు చేస్తున్నారు. పోలియో, నులి పురుగుల నివారణతోపాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ద్వారా విధుల్లో చేరిన సెకండ్‌ ఏఎన్‌ఎంలు రెగ్యులర్‌ కూడా చేయాలనే వాదన వినిపిస్తోంది.

డిమాండ్లివే..

రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్‌ఎంల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్‌ విడుదల చేసిన నేపథ్యంలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్‌ చేసినట్లుగానే తమను రెగ్యులర్‌ చేయాలని కోరుతున్నారు. పదహారేళ్లుగా అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నామని, కనీస వేతనం రూ.41వేలు ఇవ్వాలని కోరుతున్నారు. రూ.10లక్షల హెల్త్‌ ఇన్సూరెన్స్‌ కల్పించాలని, దురదృష్టవశాత్తు ఎవరైనా మృతిచెందితే రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించాలని డిమాండ్‌ చేస్తున్నారు. ప్రస్తుత నోటిఫికేషన్‌తో యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న వారు అరవైశాతం ఉన్నారని, ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే ఒక వైపు విధులు నిర్వర్తిస్తూ మరోవైపు పరీక్షలకు ప్రిపేర్‌ ఎలా అవుతామని ప్రశ్నిస్తున్నారు. కనీసం వెయిటేజీ కూడా ఇవ్వకపోవడంతో వివక్షకు గురవుతున్నామంటున్నారు.

రెగ్యులరైజ్‌ చేయాలి



నేను యాభై సంవత్సరాలు ఉన్నా. ఏఎన్‌ఎం నోటిఫికేషన్‌కు అర్హత 44 ఏళ్లే. నేను ఎలా పరీక్ష రాయాలి. 16 సంవత్సరాలుగా పని చేస్తున్నాను. మొదటి ఏఎన్‌ఎంకు సమానంగా పనిచేస్తున్నా. – వసంత, రెండో ఏఎన్‌ఎం

ప్రభుత్వం ఆదుకోవాలి



రెండో ఏఎన్‌ఎంలుగా అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నాం. ఉద్యోగ భద్రత లేదు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో రెగ్యులరైజ్‌ చేయాలి. మాలో ఎంతోమంది వయసు మీరి ఉన్నారు. మంత్రి కేటీఆర్‌ మమ్మల్ని ఆదుకోవాలి. – విజయనిర్మల, రెండో ఏఎన్‌ఎం

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- ఎమ్మెల్యే సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వినతులు



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, కేకే.మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్‌: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు డిమాండ్‌ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈమేరకు హైదరాబాద్‌లో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్కను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సిరిసిల్ల కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి కేకే. మహేందర్‌ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్‌, అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి, డిప్యూటీ కార్యదర్శి సీహెచ్‌. మహాలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, శ్రీలత, మల్లికార్జున్‌, తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే వేములవాడ నుంచి పోటీ చేస్తా

- బీఆర్‌ఎస్‌ నాయకుడు గోలి మోహన్‌



మాట్లాడుతున్న గోలి మోహన్‌

వేములవాడ: తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించానని, కేసీఆర్‌, కేటీఆర్‌లతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, బీఆర్‌ఎస్‌ పార్టీ ఆదేశిస్తే వేములవాడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమేనని ఆ పార్టీ నాయకుడు, ఆధ్య గోలి ఫౌండేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ మోహన్‌ గోలి పేర్కొన్నారు. వేములవాడలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో మేధావులు, ఎన్‌ఆర్‌ఐలతో కలసి పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి ఏదైనా మేలు చేయాలన్న తలంపుతోనే యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమెరికాలో ప్రొఫెసర్‌గా ఉంటూ అనేక కంపెనీలకు అనుసంధానంగా పని చేస్తున్నానని, తనకున్న అనుభవంతో ఉన్నత చదువులు చదువుకున్న వారికి విదేశాల్లో ఉద్యోగాలిప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటికే వేలాది మందికి సాఫ్ట్‌వేర్‌ కంపెనీల్లో ఉద్యోగాలిప్పించినట్లు పేర్కొన్నారు. పొట్టకూటికి, ఉద్యోగాల పేరుతో విదేశాలకు వెళ్లి అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతవాసులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూనే ఉన్నానన్నారు.

కిక్‌ బాక్సింగ్‌ కోచ్‌గా శ్రీనివాస్‌

సిరిసిల్ల కల్చరల్‌: జిల్లా కేంద్రానికి చెందిన మార్షల్‌ ఆర్ట్స్‌ మాస్టర్‌ వడ్నాల శ్రీనివాస్‌ కిక్‌ బాక్సింగ్‌ కోచ్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌ నాంపెల్లిలోని ఓయో ఒపెరా హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఎంపికైనట్లు ప్రకటించారు. సర్టిఫికెట్‌ను రాష్ట్ర కిక్‌ బాక్సింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్‌ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను అసోసియేషన్‌ జిల్లా గౌరవాధ్యక్షుడు పట్టణ టీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు జిందం చక్రపాణి, అక్కనపల్లి వినోద్‌కుమార్‌ అభినందించారు.

విద్యుదాఘాతంతో ఎడ్లు మృతి

రామడుగు: మండలంలోని వెదిరలో విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వెదిరకు చెందిన పన్యాల లచ్చిరెడ్డి భూమిని అదే గ్రామానికి చెందిన శనిగరపు మల్లేశం అనే రైతు వరి నాటు వేసేందుకు ఆదివారం గొర్రుతో చదును చేస్తున్నాడు. ఈ క్రమంలో పొలం గట్టు పక్కనున్న విద్యుత్‌ ఇనుప స్తంభానికి విద్యుత్‌ సరఫరా అయింది. గమనించిన లచ్చిరెడ్డి మల్లేశంను అప్రమత్తం చేయడంతో పొలం గట్టు పైకి వచ్చాడు. విద్యుత్‌ షాక్‌కు గురై, ఎడ్లు అక్కడికక్కడే మృతిచెందాయి. సంఘటన స్థలాన్ని విద్యుత్‌ శాఖ అధికారులు పరిశీలించారు.